క్లుప్తంగా

సకాలంలో సిలబస్ పూర్తిచేయండి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, బోధనలో లెస్సన్ ప్లాన్, టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ఉపయోగించాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకం కింద పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు మెనూ ప్రకారం వండిపెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం



క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టే క్రాస్ ప్రోగ్రాంను ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు జెండా ఊపి, గురువారం ప్రారంభించారు. ప్రత్యేక వాహనం ద్వారా మెకానిక్‌లు వెళ్లి, గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లు, కుళాయిలను బాగు చేయనున్నారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా మండల పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారమే మండల అభివృద్ధి

రాజాం సిటీ: ప్రణాళిక ప్రకారమే మండల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధులు–పనులపై అత్యవసర సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి సంబంధించి, పనులకు అందరి ఆమోదం అవసరమన్నారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ కన్వీనర్ ఎల్. రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ వై.సునీత, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నారావు, ఎంపీడీవో బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



జన్నివలస అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ పరికరాలను ప్రారంభిస్తున్న బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, కూనాయవలస సర్పంచ్ విజయబాబు

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ సభ్యులు బొమ్మి శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు అన్నారు. మండలంలోని జన్నివలస అంగన్‌వాడీ కేంద్రానికి పోషణ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేసిన పరికరాలను గురువారం వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు అన్నిరకాల సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. పోషణ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, టేబుళ్లు, మ్యాట్‌లు, వాటర్ ప్యూరిఫైర్, గ్యాస్‌స్టవ్, ఫ్యాన్, ఫీల్డ్ సామగ్రి అందజేశారన్నారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: ముగడలో పూజలకు సిద్ధం చేసిన విశ్వేశ్వరాలయం



రాజాం సిటీ: పూజలందుకోనున్న వెయ్యేళ్ల నాటి శివలింగరుద్రేశ్వరుడు



రామభద్రపురం: ముస్తాబైన రామభద్రపురం శివాలయం

శివపూజకు వేళాయె..!

మహాశివరాత్రి పురస్కరించుకుని, ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పూజలు మొదలుకానుండడంతో శివాలయాల వద్దకు భక్తుల దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే చాలా ఆలయాలు రంగులద్దుకుని, విద్యుత్ అలంకరణలో మెరిసిపోతున్నాయి. భక్తులు సైతం సంప్రదాయ వస్త్రధారణలో భక్తిభావంతో పూజలు చేసేందుకు సన్నద్ధమయ్యారు. శివరాత్రి రోజున జాగరణ చేస్తే పుణ్యఫలం దక్కుతుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం కాగా రాత్రి అంతా మెలకువగా ఉండి, ఆ పరమశివుడిని ఆరాధించేందుకు యావత్తు భక్తజనం ఉవ్విళ్లూరుతోంది.

– సాక్షి నెట్‌వర్క్



రేగిడి: సంకిలి నాగావళి నదీతీరాన ఉన్న శివాలయంలో ఏర్పాట్లు



వంగర: సంగాంలో పూజలకు సిద్ధం చేసిన శివలింగం



వంగర: సంగాంలో సంగమేశ్వరుని ఆలయం వద్ద భద్రతా సిబ్బందికి సూచనలిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రూరల్ సీఐ శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

బొబ్బిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాడంగి మండలంలోని పింద్రంగివలస గ్రామంలోని టీడీపీకి చెందిన 20 కుటుంబాల వారు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో రావాడ తిరుపతిరావు, రౌతు ఈశ్వరరావు, రౌతు చిన్నంనాయుడు, ఇజ్జాడ వెంకటరమణ తదితర కుటుంబాల వారు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలన చూసి, ఆకర్షితులై తామంతా పార్టీలో చేరామని, బొబ్బిలి నుంచి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మళ్లీ ఎమ్మెల్యేగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని, ఆ దిశగా పనిచేస్తామని వారంతా తెలిపారు. కార్యక్రమంలో బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి



వంతెన తీర్చిన చింత

వంగర మండలంలోని సంగాంలో త్రివేణి సంగమం (వేగావతి, సువర్ణముఖి, నాగావళి నదులు కలిసే ప్రదేశం) వద్ద కొలువైన ప్రఖ్యాత సంగమేశ్వరుని దర్శనానికి రేగిడి మండలంలోని నరసనాపల్లి భక్తులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభించింది. శుక్రవారం మహాశివరాత్రి నేపథ్యంలో తక్కువ సమయంలో ఆలయాన్ని చేరుకునేలా అక్కడి నదిపై కర్రల వంతెనను గ్రామస్తులు గురువారం నిర్మించారు. ఈ వంతెన మీదుగా కేవలం 500 మీటర్లు నడిచి, పవిత్ర క్షేత్రం చేరుకోవచ్చు. ఇదివరకు అయితే 10 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే తప్ప క్షేత్రానికి వెళ్లలేని దుస్థితి అని, ఇప్పుడు వేసిన వంతెనతో ఆ చింత తీరిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మంచి పనిని చేసిన గ్రామ యువతను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

– రేగిడి.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ పక్కనే పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

వంగర: గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని అరసాడ జంక్షన్ నుంచి నీలయ్యవలస గ్రామం వరకు నాబార్డు నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ రోడ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని, అయితే ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడం జరుగుతోందన్నారు.

వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమానంగా చూస్తోందని, ఓ వైపు సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే మరోవైపు అభివృద్ధి పనులు జోరుగా చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచ్ ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన, పశువైద్య శిబిరాలను ఎమ్మెల్యే గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మేలుజాతి ఆవుదూడలు పుట్టించడం ద్వారా పశు సంతాన వృద్ధి కలుగుతోందని, తద్వారా పాడిరైతుల అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ఏడీ ఎల్.విష్ణు, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.అప్పలనాయుడు, ఎంపీటీసీ కె.చిన్నంనాయుడు, జెడ్పీటీసీ పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, పాలక సభ్యుల మధ్య అవగాహన ఉండాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యత, సమయపాలన వంటి అంశాలపై అధికారులు, పాలక సభ్యుల మధ్య అవగాహన ఉండాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్ సభ్యుల అత్యవసర సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులంతా క్రమశిక్షణతో అజెండాను రూపొందించి, ఆమోదించుకోవాలని, పట్టణాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో పారదర్శక పాలన కొనసాగుతోందన్నారు. పథకాల పంపిణీలో కానీ అభివృద్ధి పనుల్లో కానీ ఎక్కడా అవినీతి జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా అధికారులు, నేతలు పనిచేయాలని సూచించారు. అనంతరం పలు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

సంక్షిప్తంగా...

మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కిట్లు పంపిణీ

రాజాం: మండలంలోని గురవాం, దోసరి, ఆగూరు, గడిముడిదాం గ్రామాల్లో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కిట్లును వైఎస్సార్ సీపీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు గురువారం పంపిణీ చేశారు. ఆయా గ్రామ సచివాలయాల దగ్గరలో సమావేశాలు ఏర్పాటు చేసిన ఆయన రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యకర్తలు, అభిమానులు, బూత్ కన్వీనర్లు, గృహసారథులంతా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించాలన్నారు. కార్యక్రమంలో రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు వై.వెంకటేష, ఎస్.వర్షిణి, జేసీఎస్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30 మద్యంసీసాలు స్వాధీనం

సంతకవిటి: మండలంలోని మల్లయ్యపేట కూడలిలో అక్రమంగా తరలిస్తున్న 30 మద్యంసీసాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, మందరాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎస్.డి.ప్రసాదరావు తెలిపారు.

పరీక్ష సామగ్రి వితరణ

రేగిడి: మండలంలోని లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి(పెన్నులు, అట్టలు, జామెట్రీ బాక్స్‌లు, వాటర్ బాటిల్స్)ని రాజాం వాసవీ క్లబ్ ప్రతినిధులు గ్రంధి రవికుమార్, వాకచర్ల రాజా, ఉప్పల అంబరీషు కలిసి గురువారం వితరణ చేశారు. త్వరలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీటిని అందజేశామని దాతలు తెలిపారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణారావు, వి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. మండలంలోని ముద్దాడజోగివలస, గా(ఁ)రాజుచీపురుపల్లి గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

రేగిడి: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని డీఆర్‌పీలు వై.సీతంనాయుడు, ఎం.గణేష సూచించారు. స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో జెడ్పీ ఉన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎన్‌రోల్‌మెంట్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీటీని వినియోగించి బోధన చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు.

వినతిపత్రం అందజేత

రాజాం: పట్టణంలోని చేపల మార్కెట్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేయాలని కోరుతూ రాజాం పట్టణానికి చెందిన పలువురు మత్స్యకారులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడును గురువారం కలిసి, వినతిపత్రం అందజేశారు. మార్కెట్ వద్ద గదుల నిర్మాణం, విద్యుత్ సరఫరా, నీటి సదుపాయం వంటివి కల్పించాలన్నారు. స్పందించిన వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మత్స్యకారులకు అనుకూలంగా మార్కెట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, మత్స్యకార సంఘ నాయకులు బి.తవుడు, శంకర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించండి

తెర్లాం: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, వాటిలో ఏమైనా సమస్యలుంటే నివేదిక అందజేయాలని ఉప తహసీల్దార్ గాడి భాస్కరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జోనల్ అధికారులు, రూట్ అధికారులు, బీఎల్‌వోలతో గురువారం సమావేశమైన ఆయన పోలింగ్ కేంద్రాలు సందర్శించి, వాటిలో మౌలిక సదుపాయాలున్నవీ లేనివీ తెలియజేయాలన్నారు. సమావేశంలో జోనల్ అధికారులు జి.సునీల్‌కుమార్, అనంతరావు, త్రినాధరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రాజాం సిటీ: మహిళలను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు

రేగిడి: మండలంలోని దేవుదళ కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మి మాట్లాడుతూ అన్నిరంగాల్లో మహిళలు బాగా రాణిస్తూ ఉన్నతమైన జీవనం సాగిస్తున్నారని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. బాగా చదువుకుని, జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

రాజాం సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణ పరిధిలోని సత్యనారాయణపురం సచివాలయంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పలువురు మహిళలను మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు గురువారం సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జీఎంఆర్ ఐటీల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ చేపట్టి, మహిళల శక్తిసామర్థ్యాలు, అవకాశాలు, హక్కులు, భద్రతపై అవగాహన కల్పించారు. పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో అతివలు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.